క్లుప్తంగా

అర్హుల వివరాలు నమోదు చేయాలి



ఉండవెల్లి: మండల కేంద్రంలో ఇందిరమ్మ ఇళ్లకు సంబంధించిన యాప్‌లో అర్హుల వివరాలు నమోదు చేయాలని ఎంపీడీఓ తిరుపతన్న పంచాయతీ కార్యదర్శులకు సూచించారు. శుక్రవారం మండల కేంద్రంలో ఇంటింటా నిర్వహిస్తున్న సర్వేను పర్యవేక్షించారు. కార్యక్రమంలో పంచాయతీ కార్యదర్శి అశోక్, సిబ్బంది పాల్గొన్నారు.

రాష్ట్రస్థాయి పోటీలకు ఎంపిక



ధరూరు : మండల కేంద్రంలోని జిల్లా పరిషత్ ఉన్నత పాఠశాలకు చెందిన విద్యార్థులు రాష్ట్రస్థాయి సీఎం కప్ పోటీలకు ఎంపికయ్యారు. ఈ నెల 27 నుంచి 29వ తేదీ వరకు హైదరాబాద్‌లో జరిగే పోటీల్లో పాల్గొనేందుకు ధరూరు నుంచి వెళ్లినట్లు పాఠశాల వ్యాయామ ఉపాధ్యాయుడు శ్రీనివాసులు తెలిపారు. రెండు రోజుల పాటు సరూర్‌నగర్‌లో నిర్వహించనున్న పోటీల్లో పాల్గొనున్నట్లు పేర్కొన్నారు.

అమ్మవారికి వెండి కిరీటం బహూకరణ



గద్వాలటౌన్ : నడిగడ్డ ఇలవేల్పు జమ్ములమ్మ అమ్మవారికి భక్తులు వెండి కిరీటాన్ని బహూకరించారు. హైదరాబాద్‌కు చెందిన సెవెన్ హిల్స్ ప్రింటర్స్ అధినేత కొంకతి రాకేష్ కుటుంబ సభ్యులు జమ్ములమ్మ అమ్మవారికి కిలో వెండితో చేసిన కిరీటాన్ని శుక్రవారం ఆలయ అధికారులకు అందజేశారు. అనంతరం ప్రత్యేక పూజలు చేశారు. కార్యక్రమంలో ఆలయ నిర్వాహకులు తదితరులు పాల్గొన్నారు.

సీఎంఆర్‌ఎఫ్ చెక్కు అందజేత



అలంపూర్ రూరల్ : అలంపూర్ మండల పరిధిలోని బుక్కపురం గ్రామానికి చెందిన కుమ్మరి మంగమ్మకు మంజూరైన రూ. 26 వేల సీఎంఆర్‌ఎఫ్ చెక్కును ఆమె తండ్రి కుమ్మరి నర్సింహకు రాష్ట్ర టెలికాం అడ్వైజరీ కమిటీ సభ్యుడు మహ్మద్ ఇస్మాయిల్ శుక్రవారం అందజేశారు. కార్యక్రమంలో నాయకులు గోపాల్, సతీష్‌రెడ్డి, నారయణరెడ్డి, సురేష్‌రెడ్డి, బోయ ఆంజనేయులు, కుర్వ మధు , జగన్‌గౌడ్ తదితరులు పాల్గొన్నారు.

భక్తిశ్రద్ధలతో కుంకుమార్చన



ఎర్రవల్లి: మండల కేంద్రంలోని శివాంజనేయ స్వామి ఆలయంలో శుక్రవారం భక్తులు ప్రత్యేక పూజలు నిర్వహించారు. ఈ సందర్భంగా ఆలయ ప్రధాన అర్చకుడు నర్సింహస్వామి ఆధ్వర్యంలో కుంకుమార్చన పూజలు చేశారు. మహిళలు అధిక సంఖ్యలో హాజరై మొక్కులు చెల్లించారు. కార్యక్రమంలో నిర్వాహకులు తదితరులు పాల్గొన్నారు.

4 రోజులు బ్యాంకు సేవలకు అంతరాయం

గోపాల్‌పేట: మండల కేంద్రంలోని ఏపీజీవీ బ్యాంకు సేవలకు నాలుగు రోజులపాటు అంతరాయం ఏర్పడనుందని గోపాల్‌పేట ఏపీజీవీబీ బ్యాంకు మేనేజర్ శ్రీనివాసులు శుక్రవారం ఒక ప్రకటనలో తెలిపారు. ప్రస్తుతం ఉన్న ఏపీజీవీబీ బ్యాంకు తెలంగాణ గ్రామీణ బ్యాంకులో విలీనం అవుతున్నందున 28, 29, 30, 31 తేదీల్లో బ్యాంకు సేవలు నిలిచిపోతాయన్నారు. తిరిగి జనవరి 1, 2025 నుంచి తెలంగాణ గ్రామీణ బ్యాంకు అందుబాటులోకి వస్తుందని చెప్పారు. మండల ప్రజలు ఈ విషయాన్ని తెలుసుకొని, సహకరించాలని కోరారు.

చదవాలంటే నడవాల్సిందేనా..?

- గ్రామాలకు బస్సులు నడపని ఆర్టీసీ
- ఉచిత బస్సు సౌకర్యం ఉన్నా ఉపయోగించుకోలేని పరిస్థితి
- రెండు నుంచి నాలుగు కిలోమీటర్లు నడవాల్సిన పరిస్థితి
- ఉన్నత విద్యకు దూరమవుతున్న బాలికలు



కళాశాల వేళకు బస్ రాక తనగలకు నడిచి వెళ్తున్న బాలికలు(ఫైల్)

శాంతినగర్ : గ్రామీణ ప్రాంతాల్లోని బాలికలకు ఉన్నత విద్య అందని ద్రాక్షగా మారుతోంది. ఉన్నత చదువులు చదవాలని కుతూహలం ఉన్నా రవాణా సౌకర్యం లేక తల్లిదండ్రులు దూర ప్రాంతాలకు పంపలేక పాఠశాల స్థాయి వరకే కొందరు పరిమితమవుతున్నారు. బస్ సౌకర్యం లేక ఎండా, వానకు కాలినడకన వెళ్లాల్సి వస్తుందని చదువులు మాన్పిస్తున్న పరిస్థితులు ఏర్పడ్డాయి.

గ్రామాలకు వెళ్లని పల్లె వెలుగులు..

వడ్డేపల్లి మండల పరిధిలోని కోయిల్‌దిన్నె, బుడమర్సు, తిమ్మాజిపల్లి, జక్కిరెడ్డిపల్లి, జూలెకల్, కొంకల గ్రామాలకు ఆర్టీసీ బస్ సౌకర్యం కల్పించలేదు. తనగల గ్రామానికి అయిజ నుంచి బస్ తిరుగుతున్నా కళాశాలల వేళలకు సరిపోకపోవడంతో వెంకటాపురం స్టేజి నుంచి రెండున్నర కిలోమీటర్లు కాలినడకన గ్రామానికి చేరుకోవాల్సి వస్తోందని విద్యార్థులు వాపోతున్నారు. రాజోళి మండల పరిధిలోని ముండ్లదిన్నె, పెద్దతాండ్రపాడు, తుమ్మిళ్ల వరకు గద్వాల, కర్నూలు డిపోల నుంచి పదేళ్ల క్రితం బస్సులు తిరిగేవి. పదేళ్లుగా వాటిని నిలిపివేయడంతో మారుమూల గ్రామాల బాలికలు ఉన్నత విద్యకు దూరమవుతున్నారు. అంతేగాక అయిజ, ఇటిక్యాల, మానవపాడు, ఉండవెల్లి, ఎర్రవలి, అలంపూర్ మండలాల్లో పరిస్థితి.

ఉన్నత విద్యకు దూరం..

రవాణా సౌకర్యం లేకపోవడంతో మారుమూల గ్రామాలకు చెందిన బాలికలు పాఠశాల విద్యకే పరిమితమవుతున్నారు. ఉన్నత చదువులు చదవాలన్నా వారి ఆశ కనుమరుగవుతోంది. బస్ సౌకర్యం కల్పించి బాలికల ఉన్నత విద్యకు ప్రభుత్వం, ఆర్టీసీ సాకారం అందివాలని ఆయా గ్రామాల ప్రజలు, విద్యార్థులు కోరుతున్నారు.

ఉచిత ప్రయాణానికి నోచుకోని బాలికలు..

రాష్ట్రంలో మహిళలకు ఉచిత బస్ సౌకర్య ఉన్నప్పటికి ఉచిత ప్రయాణానికి, ఉన్నత చదువులకు నోచుకోవడం లేదని బాలికలు వాపోతున్నారు. ఆటోలపై ఆధారపడి కళాశాలలకు చేరుకోవాల్సి వస్తుందన్నారు. మరికొందరికి చిన్న వయసులోనే వివాహాలు చేస్తున్నారని ఆవేదన వ్యక్తం చేస్తున్నారు.

కాలినడకే శరణ్యం..



ఉదయం పూట మాన్‌దొడ్డి నుంచి బస్ వస్తుంది. అయిజ జూనియర్ కళాశాలకు తోటి విద్యార్థులతో కలిసి వెళ్తాం. సాయంత్రం వేళల్లో బస్సు వచ్చే వరకు చీకటి పడుతుంది. కాలేజి వదిలాక వెంకటాపురం స్టేజి వరకు వచ్చి అక్కడి నుంచి కాలినడకన గ్రామానికి చేరుకుంటున్నాం.

-సరిత, విద్యార్థి, తనగల, వడ్డేపల్లి మండలం

పదేళ్లుగా బస్ రావడం లేదు..



గత పదేళ్ల కాలంగా మా ఊరికి బస్ రావడం లేదు. పదేళ్ల క్రితం కర్నూలు, గద్వాల డిపోల నుంచి బస్‌లు తిరిగేవి. బస్‌లు నిలిపివేయడంతో ఆడపిల్లలను శాంతినగర్‌కు కాలేజీలకు పంపాలంటే తీవ్ర ఇబ్బందులు పడుతున్నాం. బస్‌లు నడిపి బాలికల ఉన్నత చదువులకు సహకారం అందించాలి.

- వేణుగోపాల్‌నాయుడు, తుమ్మిళ్ల.

ఒకే ట్రిప్పు వస్తోంది..



రామాపురానికి ఆర్టీసీ బస్ రోజుకు ఒక్క ట్రిప్పు మాత్రమే వస్తుంది. మిగతా వేళల్లో ఆటోలను ఆశ్రయించాల్సి వస్తుంది. ఆటోల్లో బాలికలను కళాశాలకు పంపేందుకు తల్లిదండ్రులు ఇష్టపడం లేదు. దీంతో ఇంటి వద్ద పొలం పనులకు తీసుకెళ్తున్నారు. బస్ సౌకర్యం కల్పించి బాలికల ఉన్నత విద్యకు సాకారం అందించాలి.

- కిట్టు, రామాపురం, వడ్డేపల్లి మండలం

గద్వాలకు అఖిలపక్షం కమిటీ నాయకులు



గద్వాలకు బయలుదేరుతున్న అఖిల పక్షం కమిటీ నాయకులు

అయిజ: జిల్లా కేంద్రంలో లాయర్లు నిర్వహిస్తున్న ధర్నాకు మద్దతిచ్చేందుకు శుక్రవారం అఖిపక్షం కమిటీ నాయకులు గద్వాలకు బయలుదేరారు. ఈ సందర్భంగా అఖిలపక్షం కమిటీ మండల అధ్యక్షుడు ఆంజనేయులు మాట్లాడుతూ.. ప్రజల అవసరాలు దృష్టిలో ఉంచుకుని లాయర్లు పీజేపీ క్యాంప్ ఆవరణలోనే కోర్టు సముదాయాన్ని నిర్మించాలని దీక్ష చేస్తున్నట్లు తెలిపారు. వారికి మద్దతుగా ప్రజా సంఘాలు, కుల సంఘాలు, రైతు సంఘాలతో కలిసి దీక్షలో కూర్చొని లాయర్లకు సంపూర్ణంగా మద్దతిస్తున్నట్లు పేర్కొన్నారు. కార్యక్రమంలో అఖిల పక్షం కమిటీ సభ్యులు నీలకంఠమయ్య, హనుమంతు, విజయభాస్కర్ రెడ్డి, వెంకట్రాములు, తిరుమలరెడ్డి, మన్నన్, నరసింహులు తదితరులు పాల్గొన్నారు.

ప్రమాదం అంచున ప్రయాణం



గుంతలమయంగా కాశీపురం నుంచి కర్నూల్‌కు వెళ్లే రహదారి

అలంపూర్ రూరల్ : అలంపూర్ నుంచి కాశీపురం మీదుగా కర్నూల్‌కు వెళ్లే రహదారికి మరమ్మతు చేపట్టకపోవడంతో తీవ్ర ఇబ్బందులు పడుతున్నట్లు గ్రామస్తులు, వాహనదారులు వాపోతున్నారు. ప్రతి రోజు అలంపూర్ నుంచి కర్నూల్‌కు వందలాది మంది వాహనాలు ప్రయాణిస్తున్నా అధికారులు మాత్రం పట్టించుకోవడం లేదని వాపోతున్నారు. రోడ్డు గుంతలమయంగా మారడంతో ఎప్పుడు ఏ ప్రమాదం సంభవిస్తుందోని భయాందోళనలో ఉన్నారు. అధికారులు స్పందించి రోడ్డు మమ్మతులు చేపట్టేలా చర్యలు తీసుకోవాలని కోరుతున్నారు.

ఘనంగా క్రిస్మస్ సంబరాలు



క్రిస్మస్ సంబరాల్లో పాల్గొన్న చిన్నారులు

ధరూరు : క్రిస్మస్ పర్వదినాన్ని పురస్కరించుకొని గురువారం రాత్రి ధరూరులోని ఎంబీ షాలేం చర్చిలో నిర్వహించిన సాంస్కృతిక కార్యక్రమాలు అలరించాయి. అర్ధరాత్రి వరకు జరిగిన వేడుక చూపరులను ఆకట్టుకుంది. క్రీస్తు జననంపై సందేశాత్మక పాటల నృత్యాలు, స్కిట్స్ వేశారు. సంఘకాపరి సీపీ యూధా ప్రసాద్ కార్యక్రమాలకు నేతృత్వం వహించారు. చిన్నారుల వివిధ వేషధారణల్లో అలరించారు. కార్యక్రమంలో సంఘ పెద్దలు, యువకులు తదితరులు పాల్గొన్నారు.

జట్టుగా శ్రమిస్తేనే విజయం



కబడ్డీ టోర్నమెంట్ ప్రారంభిస్తున్న హనుమంతునాయుడు

గట్టు : ఆటగాళ్లంతా కలసి జట్టుగా శ్రమిస్తేనే విజయం వరిస్తుందని, గెలుపు కోసం చివరిదాకా పోరాడాలని బీఆర్‌ఎస్ నాయకుడు బల్గెర హనుమంతునాయుడు అన్నారు. శుక్రవారం ఇందువాసి గ్రామంలో క్రిస్మస్, నూతన సంవత్సరం సందర్భంగా ఏర్పాటు చేసిన కబడ్డీ టోర్నమెంట్‌ను ఆయన ప్రారంభించారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ.. గెలుపోటములను సమానంగా స్వీకరించాలన్నారు. గత బీఆర్‌ఎస్ ప్రభుత్వం క్రీడలకు ఎంతో ప్రాధాన్యమిచ్చినట్లు తెలిపారు. కార్యక్రమంలో మాజీ సర్పంచ్ దుల్లయ్య, బీఆర్‌ఎస్ నాయకులు నూర్‌పాష, రాజునాయుడు, రామునాయుడు, బాసు బొజ్జయ్య, నల్లారెడ్డి, మాచర్ల లోకేష, తిమ్మప్ప, భీమన్న, ఆంజనేయులు, వీరేష్ తదితరులు పాల్గొన్నారు.

ఇంటిని ఢీకొన్న పొక్లెయిన్



కేటీదొడ్డి: జేసీబీ వాహన డ్రైవర్ నిర్లక్ష్యంతో వాహనాన్ని ఇంటిని ఢీకొన్న ఘటన మండల పరిధిలోని పాతపాలెం గ్రామంలో శుక్రవారం చోటు చేసుకుంది. మైనర్ బాలుడు జేసీబీ వాహనాన్ని నడపడం వల్లే ప్రమాదం చోటు చేసుకుందని ఇంటి యాజమాని సయ్యద్ షాష ఆరోపించారు. వివరాలు.. పాతపాలెం గ్రామానికి చెందిన మైనర్ బాలుడు శుక్రవారం జేసీబీ వాహనాన్ని నడుపుతూ గ్రామానికి చెందిన సయ్యద్ పాష ఇంటిని ఢీకొట్టాడు. దీంతో ఇల్లు పాక్షికంగా దెబ్బతింది. మైనర్ బాలుడు జేసీబీ వాహనం నడపడం వల్లే ప్రమాదం చోటు చేసుకుందని స్థానికులు తెలిపారు. వాహన యజమానిపై చర్యలు తీసుకోవాలని కోరుతున్నారు.

నల్లబ్యాడ్జీలు ధరించి '104' ఉద్యోగుల నిరసన



నల్లబ్యాడ్జీ ధరించి విధులు నిర్వహిస్తున్న '104' సిబ్బంది

అమరచింత: జిల్లాలోని ఆస్పత్రులలో విధులు నిర్వహిస్తున్న తమకు ఆరు నెలలుగా వేతనాలు అందడం లేదంటూ శుక్రవారం '104' ఉద్యోగులు నిరసన వ్యక్తం చేశారు. ఈసందర్భంగా అమరచింత డీఎంఆర్‌ఎం ఆస్పత్రిలో శుక్రవారం ల్యాబ్ టెక్నీషియన్ రాజుతో పాటు సిబ్బంది నల్లబ్యాడ్జీలతో విధులకు హాజరయ్యారు. ఈమేరకు ఆయన మాట్లాడుతూ అక్టోబర్ వరకు ఆరు నెలల వేతనాలు బకాయిలుగా ఉండటం వల్ల 104 ఉద్యోగస్తులు తీవ్ర ఇబ్బందులు పడుతున్నారన్నారు. తమ సమస్యపై అనేక పర్యాయాలు ప్రభుత్వానికి వినతిపత్రాలు ఇస్తున్న ఫలితం లేదన్నారు. రాష్ట్ర ప్రభుత్వం డిసెంబర్ 4న జీఓ నంబర్ 706 ప్రకారం.. రూ.12.56 కోట్లు విడుదల చేసిందని, అయినా నేటి వరకు ఉద్యోగస్తులకు అందలేదన్నారు. ఇప్పటికైనా ప్రభుత్వం చొరవ చూపి తమకు బకాయిలో ఉన్న వేతనాలను చెల్లించాలని డిమాండ్ చేశారు.

మాజీ ఎంపీని పరామర్శించిన ఎమ్మెల్యే



పరామర్శిస్తున్న ఎమ్మెల్యే విజయుడు

అలంపూర్ : మాజీ ఎంపీ మందా జగన్నాథంను ఎమ్మెల్యే విజయుడు పరామర్శించారు. హైదరబాదులోని నిమ్స్ ఆసుపత్రిలో నాగర్‌కర్నూల్ మాజీ ఎంపీ మందా జగన్నాథం గత నాలుగు రోజులుగా చికిత్స పొందుతున్నారు. ఈ నేపథ్యంలో ఎమ్మెల్యే శుక్రవారం ఆస్పత్రికి వెళ్లి పరామర్శించారు.

కాంగ్రెస్ నాయకులు పరామర్శ

ఎర్రవల్లి: అనారోగ్యంతో హైదరాబాద్‌లో చికిత్స పొందుతున్న మాజీ ఎంపీ మంద జగన్నాథంను మండల కాంగ్రెస్ పార్టీ నాయకులు శుక్రవారం పరామర్శించారు. హైదరాబాద్ నిమ్స్ ఆసుపత్రికి వెళ్లి చికిత్స ఆయన ఆరోగ్య పరిస్థితిని అడిగి తెలుసుకున్నట్లు వారు తెలిపారు. కార్యక్రమంలో నాయకులు సోమనాద్రి, నర్సిరెడ్డి, వెంకటేష్, రాజు, యోహాన్, బజారి, బీచుపల్లి, తదితరులు పాల్గొన్నారు.

బండి సంజయ్‌ను కలిసిన బీజేపీ నాయకులు



బండి సంజయ్‌కు స్వాగతం పలుకుతున్న కేటీదొడ్డి బీజేపీ నాయకులు

ధరూరు : కర్నాటక పర్యటనకు విచ్చేసిన కేంద్ర సహాయ మంత్రి బండి సంజయ్‌ను మండల బీజేపీ నాయకులు కలిశారు. రాయిచూరు నుంచి గద్వాలకు వెళ్తుండగా మార్గమధ్యలో ధరూరులోని వైఎస్సార్ చౌరస్తా వద్ద బీజేపీ మండల అధ్యక్షుడు రాజేష్, వేమారెడ్డి, ప్రతాప్, కొత్తపాలెం సుభాష్ తదితరులు కలిశారు. అల్వలపాడు ఎంపీహెచ్‌ఎస్ ఉన్నత పాఠశాలగా అప్‌గ్రేడ్ అయినప్పటికీ ఉన్నత పాఠశాలకనుగుణంగా గదులు, ఉపాధ్యాయులు నియామకం చేపట్టాలని వినతిపత్రం అందజేశారు.

ఎర్రవల్లి: కేంద్ర హోంశాఖ సహాయ మంత్రి బండి సంజయ్‌ను శుక్రవారం ఎర్రవల్లి సరస్వతి విద్యా సంస్థల చైర్మెన్ గోవర్ధన్‌రెడ్డి ఘనంగా సన్మానించారు. ఈ సందర్భంగా జిల్లా కేంద్రంలో జరిగిన ఓ సమావేశానికి హాజరైన కేంద్ర సహాయ మంత్రిని మర్యాద పూర్వకంగా కలిసి బొకే అందజేశారు.

కేటీదొడ్డి : కర్నాటక నుంచి గద్వాల వైపు వెళ్తున్న కేంద్ర మంత్రి బండి సంజయ్‌కు మండల నాయకులు ఘన స్వాగతం పలికారు. మండల కేంద్రంలో బీజేపీ నాయకులు బలిగెర శివారెడ్డి, జిల్లా అధ్యక్షుడు రాంచంద్రారెడ్డి, రామాంజనేయులు, శ్రీపాదరెడ్డి, నాగేష్ తదితరులు మంత్రికి సాదర స్వాగతం పలికారు. కార్యక్రమంలో బీజేపీ నాయకులు తదితరులు పాల్గొన్నారు.

టీబీ వ్యాధి నివారణపై అవగాహన

పాన్‌గల్: మండలంలోని గోప్లాపూర్, గోప్లాపూర్‌తండాలో వైద్య సిబ్బంది ఆధ్వర్యంలో టీబీ వ్యాధి నివారణపై శుక్రవారం అవగాహన కల్పించారు. ఈ సందర్భంగా కమ్యూనిటీ హెల్త్ ఆఫీసర్ రామయ్య మాట్లాడారు. రెండు వారాలకు మించి ఎడతెరపి లేకుండా దగ్గు, జ్వరం, తెమడలో రక్తం పడటం, అలసట లేదా నీరసం, రాత్రి పూట చెమటలు పట్టడం, స్వల్ప కాలంలో బరువు తగ్గడం, శారీరక ఆరోగ్యంలో ఆకస్మిక మార్పులు, ఏదైనా శరీర భాగంలో లింపు గ్రంథుల వాపు, ఛాతి ఎక్స్‌రేలో అసాధారణ మచ్చలు కనిపించడం వంటి లక్షణాలు ఉంటే వైద్య పరీక్షలు చేయించుకోవాలని సూచించారు. ఈ వ్యాధి జుట్టు, గోళ్లు మినహా శరీరంలోని అన్ని అవయవాలకు వ్యాపిస్తుందన్నారు. ఎక్కువగా ఊపిరితిత్తులు, పేగులు, ఎముకలు, మూత్రపిండాలు, మెదడు, వెన్నముకకు వ్యాధి వ్యాపిస్తుందని వివరించారు. వ్యాధి సోకిన వారు క్రమం తప్పకుండా మందులు వాడితే రోగం నయమవుతుందన్నారు. వీరికి నిక్షయ్ పోషణ్ యోజన పథకం ద్వారా బలవర్ధక పోషకాహారాన్ని తీసుకునేందుకు ప్రతి నెల రూ.500 పారితోషకం అందజేస్తారని తెలిపారు. అనుమానితుల నుంచి పరీక్ష నిమిత్తం తెమడను సేకరించారు. కార్యక్రమంలో హెల్త్ అసిస్టెంట్లు సతీష్‌కుమార్, నర్సమ్మ, ఆశా కార్యకర్తలు పాల్గొన్నారు.

ఓటీఎస్ మేళాను వినియోగించుకోండి

వీపనగండ్ల: మండల కేంద్రంలోని ఇండియన్ ఓవర్సీస్ బ్యాంకు ద్వారా రుణాలు తీసుకుని దీర్ఘకాలికంగా చెల్లించని వారు ప్రత్యేక వన్ టైం సెటిల్‌మెంట్ స్కీం ద్వారా రుణ విముక్తులు అయ్యే వెసులుబాటు ఉందని, అవకాశాన్ని ఖాతాదారులు వినియోగించుకోవాలని బ్యాంకు మేనేజర్ రవీంద్‌ర్‌బాబు కోరారు. ఈ నెల 30, 31వ తేదీన రెండు రోజుల పాటు ఈ మేళాను నిర్వహిస్తున్నామని, పైప్‌లైన్, ముద్ర, వ్యక్తిగత రుణాలు, తీసుకున్న వారు మేళాలో పాల్గొని బ్యాంకు ద్వారా అందే వెసులుబాటును వినియోగించుకోవాలన్నారు.

దేశం మెచ్చిన ఆర్థికవేత్త



జూలెకల్‌లో మాజీ ప్రధాని మన్మోహన్‌సింగ్‌కు నివాళులర్పిస్తున్న యువకులు



అయిజలో కాంగ్రెస్ నాయకుల నివాళి



మానవపాడులో నివాళులర్పిస్తున్న నాయకులు

అయిజ: భారత మాజీ ప్రధాని, దేశంలో ఆర్థిక సంస్కరణల పితామహుడు డాక్టర్ మన్మోహన్‌సింగ్ మృతిపై వివిధ పార్టీల, సంఘాల నాయకులు సంతాపం వ్యక్తం చేశారు. ఈ సందర్భంగా మండల కేంద్రంలోని కాంగ్రెస్ పార్టీ కార్యాలయంలో నాయకులు ఆయన చిత్రపటానికి పూలమాల వేసి నివాళులర్పించారు దేశానికి ఆయన చేసిన సేవలను కొనియాడారు. కార్యక్రమంలో నాయకులు ఆర్ శ్రీధర్, హనుమన్న, మధుకుమార్ పాల్గొన్నారు.

మాజీ ప్రధానికి నివాళులు..

మానవపాడు: మాజీ ప్రధాని మన్మోహన్‌సింగ్ మృతిపై శుక్రవారం మండల కేంద్రంలోని గాంధీచౌక్ వద్ద మండల కాంగ్రెస్ పార్టీ అధ్యక్షుడు జగన్‌మోహన్‌నాయుడు ఆధ్వర్యంలో నివాళుర్పించారు. దేశం, ప్రజల పట్ల ఆయన సేవాభావం స్మరించుకోదగినదన్నారు. కార్యక్రమంలో మండల కాంగ్రెస్ యూత్ అధ్యక్షుడు శేఖర్, యూత్ అధ్యక్షుడు పురుషోత్తం, మైనార్టీ నాయకులు మాలిక్‌బాషా, మల్లేష్, వెంకటన్న, తదితరులు పాల్గొన్నారు.

ఉండవెల్లిలో..

ఉండవెల్లి: మండల కేంద్రంలోని రాజీవ్ గాంధీ విగ్రహం వద్ద మాజీ ప్రధాని మన్మోహన్‌సింగ్ చిత్రపటానికి కాంగ్రెస్ నాయకులు పూలమాలలు వేసి నివాళులర్పించారు. కార్యక్రమంలో కాంగ్రెస్ పార్టీ జిల్లా కార్యదర్శి నాగేష్, రమేష్, నాగరాజు, శ్రీకాంత్ తదితరులు పాల్గొన్నారు.

ఎర్రవల్లిలో..

ఎర్రవల్లి: కాంగ్రెస్ పార్టీ మండలాధ్యక్షుడు వెంకటేష్ యాదవ్ ఆధ్వర్యంలో మండల కేంద్రంలో మాజీ ప్రధాన్ని మన్మోహన్‌సింగ్‌కు ఘనంగా నివాళులర్పించారు. ఎర్రవల్లి కూడలిలో జిల్లా గ్రంథాలయ చైర్మన్ నీలి శ్రీనివాసులు నాయకులతో కలిసి ఆయన చిత్రపటానికి పూల మాలలు వేసి మౌనం పాటించారు. కార్యక్రమంలో నాయకులు రుక్మాందర్‌రెడ్డి, సోమనాద్రి, తదితరులు పాల్గొన్నారు.

గట్టులో..

గట్టు : మాజీ ప్రధాని మన్మోహన్‌సింగ్ మృతిపై మండల కేంద్రంలోని పంచాయతీ కార్యాలయంలో మాజీ సర్పంచ్ ధనలక్ష్మీ, రిటైర్డ్ హెడ్మాస్టర్ గోవిందప్పలు నివాళులర్పించారు. ఆయన దేశానికి తీరని లోటని పేర్కొన్నారు. కార్యక్రమంలో రిటైర్డ్ ఎంఈఓ సత్యనారాయణ, మాజీ ఆప్కో డైరెక్టర్ దోమవీరన్న తదితరులు పాల్గొన్నారు.

ఇటిక్యాలలో..

ఇటిక్యాల: మండల పరిధిలోని వివిధ గ్రామాల్లో శుక్రవారం మాజీ ప్రధాని మన్మోహన్‌సింగ్‌కు పలువురు నాయకులు నివాళులర్పించారు. ఆయన చిత్రపటానికి పూలమాల వేసి మౌనం పాటించారు.

కొవ్వొత్తులతో నివాళులు..

శాంతినగర్ : మాజీ ప్రధాని మన్మోహన్‌సింగ్‌కు వడ్డేపల్లి మండల పరిధిలోని జూలెకల్ గ్రామంలో యువకులు కొవ్వొత్తులతో నివాళులర్పించారు. దూర దృష్టిగల ఆర్థికవేత్తగా ఆయన చేసిన సేవలు కొనియాడారు. దేశం మహానేతను కోల్పోయిందన్నారు. కార్యక్రమంలో శేఖర్, గోపాల్, వెంకట్, అంజి తదితరులు పాల్గొన్నారు.



గట్టు పంచాయతీ కార్యాలయం వద్ద నాయకుల నివాళి



ఎర్రవల్లిలో మన్మోహన్‌సింగ్‌కు నివాళులర్పిస్తున్న కాంగ్రెస్ నాయకులు



ఉండవెల్లిలో జోహార్లు కొడుతున్న కాంగ్రెస్ నాయకులు